క్లుప్తంగా

108లో ప్రసవం



108లో ప్రసవించిన మహిళ

పుల్లలచెరువు: 108లో మండలంలోని రెంటపల్లి గ్రామానికి చెందిన మహిళ ప్రసవించింది. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. మండలంలోని రెంటపల్లి గ్రామానికి చెందిన కె.సునీతకు పురిటి నొప్పులు రావడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. గ్రామం నుంచి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే మార్గ మధ్యంలో పురిటి నొప్పులు అధికం కావడంతో ఎమర్జెన్సీ మెడికల్ ఆపరేటర్ నానీ, ఎస్.కిషోర్‌లు బంధువుల సహకారంతో డెలివరీ చేశారు. ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. సమయానికి దేవుడిలా వచ్చి ఆదుకున్న 108 సిబ్బందికి సునీత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

దొనకొండ: స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీకి చెందిన అర్హత ఉన్న విద్యార్థులు తమ పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నానీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



పెద్దారవీడు చెరువు కట్ట వద్ద చిల్లకంప



బద్వీడుచెర్లోపల్లి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ఆదమరిస్తే ప్రమాదమే



పెద్దారవీడు సమీపంలో గుంతలు పడటంతో వేసిన రాళ్లు



అంకాళమ్మ దేవాలయం సమీపంలో తారు లేవడంతో ఏర్పడిన గుంత

పెద్దారవీడు: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా మారిన రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మండలంలోని దేవరాజు గట్టు నుంచి చిన్నదోర్నాల అడ్డ రోడ్డు వరకు అక్కడక్కడా గుంతలు పడటంతో ప్రయాణం చేయాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. పేరుకే ప్రధాన రహదారి. దేవరాజుగట్టు, పెద్దారవీడు, బద్వీడుచెర్లోపల్లి, రామచంద్రకోట, చింతల అగ్రహారం, చిన్నదోర్నాల గ్రామాల మధ్యలో అక్కడక్కడా గుంతలు ఏర్పడటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో కర్నూల్, శ్రీశైలం, కడప, ఒంగోలు, మార్కాపురం, తిరుపతి, తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు, టూరిస్టు బస్సులు, ఆటోలు, లారీలు, కారులు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలతో రద్దీగా ఉంటుంది. పెద్దారవీడు, ఎస్.కొత్తపల్లి గ్రామాల చెరువు కట్టపై రోడ్డుకు ఇరువైపులా, ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద చిల్లకంప, ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు భయపడుతున్నారు. కంపచెట్ల కొమ్మలు రోడ్డుకు అడ్డంగా రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలమయమైన రోడ్లపై ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోక పోవడంతో తారు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. రాత్రి సమయంలో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు కూటమి నేతలు రహదారుల్లో చిన్న గొయ్యి పడినా రాద్ధాంతం చేసే వారని, అధికారంలోకి వచ్చాక ధ్వంసమైన రహదారులు, రోడ్డుపై గోతులు వారికి కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గాయాలు కాకముందే అధికారులు స్పందించి గుంతలను పూడ్చి వేసి మూలమలుపుల వద్ద చిల్లకంపను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. అధికారంలోకి రాగానే రోడ్లను బాగు చేస్తామని గొప్పగా ప్రకటించిన కూటమి పార్టీల నేతలు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అతీగతి లేదు.

దొనకొండలో కుక్కల బెడద



అరబస్తాన్‌లో గుంపులుగా ఉన్న వీధి కుక్కలు

దొనకొండ: మండల కేంద్రం దొనకొండలోని ఓబ్బాపురం, వీవీపురం, అరబస్తాన్, శివాజీ నగర్, బేతేలుపురం, బ్రహ్మరావుపేట వీధుల్లో రోడ్ల వెంట కుక్కల బెడద తీవ్రంగా ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. చిన్నారులను పాఠశాలలకు పంపించాలంటే తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో నడిచి వెళ్లడంతో కుక్కలు వెంటాడుతుండటంతో తప్పించుకునేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికులు చాలా సార్లు కుక్కల బెడద నివారించాలని పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దొనకొండలో కుక్కల బెడద సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

కురిచేడు: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం మండలంలోని ఆవులమంద పంచాయతీలోని ప్రతిజ్ఞాపురి కాలనీలో శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కుమారి మాట్లాడుతూ ఆదివాసీలు అంటే అడవిలో ఉన్న వనరులు ఆధారంగా జీవించేవారని, దేశంలో అనేక జాతుల వారు అడవి జంతువులను, అడవినే నమ్ముకొని జీవిస్తున్నారన్నారు. వారికి ఇప్పటికీ సరైన జీవనాధారాలు లేక హక్కులు కూడా పొందలేకపోతున్నారన్నారు. ఆదివాసీలు అడవిలో జంతువులు, పక్షులు ప్రతి సంపదపై ఆధారపడి జవిస్తారని చెప్పారు. ఊరికి దూరంగా అడవుల్లో మౌలిక వసతులకు, విద్యకు దూరంగా చీకటి బతుకులు బతుకుతూ వారి హక్కులను కాపాడుకోలేకపోతున్నారన్నారు. అభివృద్ధి విద్య ద్వారానే సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించుకోవాలని కోరారు. దర్శి ఏరియా కో ఆర్డినేటర్ గుంటూరు నాగమణి మాట్లాడుతూ ఆగస్టు 9వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీలు పెద్ద పండగ చేసుకునే రోజన్నారు. ఐక్యరాజ్య సమితి కేటాయించిన రోజున ఆదివాసీలు 18 కోట్ల మంది మాట్లాడే భాష 'గోరు బొల్లి'ని భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. యానాది, చెంచు, బుడబుక్కల, జంగాల కులాలను విద్యలో ముందుకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అటవీ హక్కుల చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, పిల్లలు పాల్గొన్నారు



ఆదివాసీ దినోత్సవానికి హాజరైన కాలనీ మహిళలు

గులాబీ రంగు పురుగుతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏఓ లక్ష్మీనారాయణ

పెద్దారవీడు: ఖరీఫ్ సీజన్లో పత్తి పంటలో గులాబీ రంగు పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి ఎన్. లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలో గొబ్బూరు రామాలయం వద్ద ఆత్మ ప్రకాశం సౌజన్యంతో పత్తిలో గులాబీ రంగు పురుగు సమగ్ర యాజమాన్యంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో మొగ్గ దశలో లోపలికి వెళ్లి కనపడకుండా వృద్ధి చెందుతూ అప్పుడప్పుడే ఏర్పడుతున్న దూదిని తింటూ పెరుగుతుందని, కాయ పగిలి దూది తీసేటప్పుడు మాత్రమే కనిపిస్తుందని చెప్పారు. పురుగు సోకినప్పుడు పూలు విచ్చుకోక గుడ్డి పూలు కనిపిస్తాయని, 50 మొక్కలు పరిశీలించినప్పుడు 20 గుడ్డి పూలు కనిపిస్తే పురుగు సోకిందని అర్థం చేసుకోవాలన్నారు. ముందు సీజన్లో వేసిన పత్తి పంట అవశేషాలను ఉంచరాదని, విత్తనం వేయబోయే ముందే వాటిని కాల్చి వేయాలన్నారు. గులాబీ పురుగు ఉధృతిని తెలుసుకునేందుకు ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలను పైరుకు పైన అడుగు ఎత్తులో ఉండేలా పెట్టాలని, మూడు రోజులు వరుసగా 8 తల్లి రెక్కల పురుగులు పడితే క్లోరోపైరిఫోస్ లేదా ప్రొఫినోఫోస్ 400 మీలీని 500 ఎంఎల్ వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. నేలలో తేమ శాతం ఎక్కువ కావటంతో గూడ రాలుతుందని, ఎవరి పొలంలో నైనా గూడ ఇంకా రాలుతుంటే 300 గ్రాముల బోరస్ పొడిని ఎకరా పొలానికి పిచికారీ చేయాలన్నారు. కాయలు బలంగా తయారు కావడానికి ఎకరాకు 2 కేజీల నీటిలో కరిగే 13.0.45 లేదా 19.19.19 ఎరువుని పిచికారీ చేసుకోవాలన్నారు. కొన్ని పొలాల్లో రసం పీల్చే పురుగులైన తామర పురుగులు, పచ్చదోమలను గమనించి, వాటి నివారణకు ఎసిఫేట్ పొడి 400 గ్రాములను ఆకుల అడుగు బాగం బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. ఏఈఓ సునీల్‌నాయక్ వివిధ పంటల్లో విత్తన శుద్ధి చేసుకునే విధానాలను డెమో ద్వారా చేసి చూపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వీఏఏలు శ్రీకాంత్, రవి, అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆనందాల సందడి రాఖీ



మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న రాఖీలు

పుల్లలచెరువు: సోదరుడు, సోదరి మధ్య బంధాన్ని గుర్తు చేసే ప్రత్యేక రోజే రాఖీ పండగ. సోదరి తన సోదరుడి మణికట్టుకు రాఖీ కట్టి తమ మధ్య ప్రేమ, ఆప్యాయతలను పంచుకునేదే రాఖీ. శనివారం ఆ పండగను ప్రజలు ఎంతో ఘనంగా నిర్వహించుకోకున్నారు. అందులో భాగంగా మార్కెట్‌లో రంగు రంగుల, వివిధ రకాల రాఖీలు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి. పిల్లలకు ఇష్టమైన కార్టూన్ బొమ్మలు, స్పైడర్‌మెన్, వివిధ రకాల ఆకృతులతో అందుబాటులో ఉన్నాయి. శుక్రవారం మార్కెట్‌లో సందడి నెలకొంది.

సీపీఐ మహాసభలు విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

త్రిపురాంతకం: సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా నిధులు సేకరించారు. సీపీఐ నాయకులు డి.శ్రీనివాస్, బాణాల రామయ్య, వెంకటస్వామి, చెన్నారెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం నిలబెట్టారు !

సాక్షి ఎఫెక్ట్..

ఒంగోలు సబర్బన్: నగరంలోని నిత్యం రద్దీగా ఉండే బండ్లమిట్ట సెంటర్‌లోని బండారుపాళెంలో రోడ్డు మధ్యలో పడేసిన విద్యుత్ స్తంభ సమస్యను విద్యుత్ అధికారులు పరిష్కరించారు. రోడ్డు మార్జిన్‌లలో గుంత తవ్వి మధ్యలో విద్యుత్ స్తంభాన్ని పడేయటంతో వాహనదారులు, స్థానిక ప్రజలు నానా అవస్థలు పడ్డారు. దాంతో ఈ నెల 4వ తేదీన సాక్షి దినపత్రికలో ‘సమస్య తీర్చకపోగా–కొత్త సమస్యలు’ అన్న శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. దాంతో స్పందించిన ఒంగోలు నగర విద్యుత్ శాఖ అధికారులు అదే రోజు కాంట్రాక్టర్‌ను పిలిపించి విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టారు. ఆ రోడ్డులో కిందకు ఉన్న విద్యుత్ తీగలను పైకి లాగి స్థానికుల విద్యుత్ సమస్యను తీర్చారు. దాంతో ఆ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



తీగలు కిందికి వేలాడకుండా చేసిన విద్యుత్ అధికారులు



పూజలు చేస్తున్న మహిళలు



తాళ్లూరు: అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

వైభవంగా శ్రావణ మాసం ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుందరీ దేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం అమ్మవారు శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను పురస్కరించుకుని ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ప్రత్యేకంగా పొంగళ్లను సమర్పించారు. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.

కురిచేడు: స్థానిక శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శ్రీజ్ఞానప్రసూనాంబదేవికి మహిళలు ప్రత్యేక పూజలు చేయించి వాయనాలు అందజేశారు. శ్రీ కాళహస్తీశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు మహిళలతో పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెం, మాధవరం, లక్కవరం, తూర్పు గంగవరం, దోసకాయలపాడు గ్రామాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బొద్దికూరపాడు శ్రీ గంగా పర్వతవర్ధిని సోమేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న వరలక్ష్మీదేవి అమ్మవారికి ఆలయ పూజారులు నుదురుపాటి రమణయ్య, ఉద్దండం రమణయ్య జి.వాసు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విగ్నేశ్వర పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

దొనకొండ: స్థానిక అడ్డ రోడ్డులో వెలసిన శ్రీ ఆనంద ఆశ్రమంలో సామూహిక వరలక్ష్మి వ్రతం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు వినుకొండ కడియాల ఆంజనేయ శాస్త్రి ఉదయం 9 గంటల నుంచి గణపతి పూజ, కళశ పూజ, శ్రీవరలక్ష్మి అష్టోత్తర శతనామావళి, వరలక్ష్మి కథలు వివరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వరలక్ష్మి వ్రతానికి పాల్గొన్నారు. మహా నైవేద్యాలు సమర్పించారు. వ్రతంలో పాల్గొన్న మహిళలు ఒకరినొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం మహిళలు సామూహిక హారతులిచ్చారు. వచ్చిన భక్తులకు భైరవానంద స్వామి తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, అఖండ అధ్యక్షురాలు మీనాకుమారి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు



కాళహస్తీశ్వరస్వామి



బాలాత్రిపుర సుందరీదేవి మూలవిరాట్



తాళ్లూరు: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఆది దేవతకు అఖండ పూజలు

పెద్దదోర్నాల: సర్వ శుభాలను, అష్ట ఐశ్వర్యాలు ప్రసాదించే శ్రీ వరలక్ష్మీ వ్రతాన్ని మండల ప్రజలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. శ్రావణ మాసపు రెండో శుక్రవారంలో భాగంగా మహిళలు ఇష్టదైవాలను దర్శించుకుని లక్ష్మీవ్రతం చేసి నోములు నోచుకున్నారు. శుభప్రదమైన శుక్రవారం రోజు ఉదయాన్నే మహిళలు నిద్రలేచి స్నాన ఘట్టాలను ముగించుకుని దేవాలయాలకు చేరి పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ కర్పటీరీలిక వస్త్రం పూలు, పండ్లు, ఆకులతో వాయనాలు అందుకుని నిత్యసుమంగళిగా ఉండాలని, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. షిర్డి సాయి ఆలయం, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, అయ్యప్ప స్వామి ఆలయాలలో అమ్మవారిని ప్రత్యేక పూల అలంకరణ చేసి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సరస్వతీదేవి సన్నిధిలో చిన్నారులకు అక్షరభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. శ్రావణ మాసం ఎంతో ప్రీతిప్రతమైన నెల. ఈమాసంలో స్త్రీలు సౌభాగ్యదాయకమైన వ్రతాన్ని చేసి నోములు నోస్తే అంతా శుభమే జరుగుతుంది. పవిత్ర సంకల్పంతో అమ్మవారికి భక్ష్య బోనాలను నివేదిస్తే అమ్మవారి కటాక్షంతో సహా సౌభాగ్యాలు కలుగుతాయని షిర్డీసాయి ఆలయ అర్చకులు కోటిలింగం స్వామి తెలిపారు.



పెద్దదోర్నాల: సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు



త్రిపురాంతకం: క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



త్రిపురాంతకం: అమ్మవారికి పొంగళ్లు సమర్పిస్తున్న మహిళలు